క్లుప్తంగా

నూతన విద్యా విధానాన్ని రద్దుచేయాలి

జూలూరుపాడు: నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందన్నారు. యూనివర్సిటీలను విభజన చేసి విద్యను కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేస్తుందన్నారు. కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలుకు పూనుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వాహనాల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం


వివరాలు వెల్లడిస్తున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ, ఏరియా హాస్పిటల్‌లో అద్దె వాహనాలు నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. శనివారం ఇల్లెందులోని తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఒక నాన్ ఏసీ జీప్ వాహనం, ఒక అంబులెన్సు కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 21 నుంచి నవంబర్ 11 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫీజు రూ.590 చెల్లించి జీఎం కార్యాలయంలో ఫైనాన్స్ విభాగంలో సమర్పించాలని కోరారు. ఓసీ నిర్వాసితులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, మాజీ కార్మికుల పిల్లలకు రెండో ప్రాధాన్యత, ఇక ప్రభావిత ప్రాంత నిరుద్యోగులకు మూడో ప్రాధాన్యత ఉంటుందన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు


అవగాహన కల్పిస్తున్న పశు వైద్య సిబ్బంది

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగుండాల గ్రామంలో శనివారం పశువులకు వైద్యులు గాలికుంటు టీకాలు వేశారు. నలతగా ఉన్న పశువుల నుంచి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నప్పుడు పశువులకు పలు రకాలైన వ్యాధులు వస్తాయని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బానోత్ రాజేష్, ట్రెయినీ డాక్టర్ అంకమ్మరావు, సిబ్బంది వేణు, బతుకయ్య, విజయలక్ష్మి, రాము, శ్రీను, విజయ్, కొమరయ్య, పుష్పలత, అనిత పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

పాల్వంచరూరల్: మండల పరిధిలోని దంతలబోరు పంచాయతీలోని ఎర్రబోరు గ్రామంలో ఆదివాసీ గిరిజనులకు శనివారం స్త్రీ శక్తి ఫౌండేషన్ సభ్యురాలు అనిత దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మల రాంబాబు, ఉమా, పావని, ప్రియా పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: పట్టణంలోని బీసీఎం రోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్ నిర్వాహకులు విద్యార్థులు సంప్రదాయం ప్రకారం నుదుట పెట్టుకున్న బొట్టును తుడిపివేయిస్తున్నారని, వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఎంఈఓ శ్రీరాంమూర్తికి వినతి పత్రం అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ బలవంతంగా విద్యార్థుల బొట్టును తొలగింపజేస్తున్నారని ఆరోపించారు. నాయకులు మాదారపు లక్ష్మణ్, దారవత్ నరేష్, మాలోతు ప్రశాంత్, దాసరి రమేష్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లు, కాంప్లెక్స్ నిర్మాణాలకు స్థల పరిశీలన

టేకులపల్లి: మండల కేంద్రంలోని రామాలయం వద్ద ప్రతీ శనివారం వారాంతపు సంత నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు సంత ప్రదేశంలో కమ్యూనిటీ మరుగుదొడ్లు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉప్పు దీప్తి, నాయకుడు బోడ మంగీలాల్ నాయక్ ఉన్నారు.

ఆహ్లాదానికి అడ్డంకి..


పర్యాటకుల చుట్టూ తిరుగుతున్న వానరాలు


డ్యామ్‌పైన గుంపులుగా ఉన్న కోతులు


బైక్‌ను పరిశీలిస్తూ..

కిన్నెరసానిలో కోతుల స్వైరవిహారం

- భయభ్రాంతులకు గురవుతున్న పర్యాటకులు
- ఏదైనా తినాలన్నా భయమే...
- పట్టించుకోని అధికారులు

పాల్వంచరూరల్: ప్రకృతి అందాలను తిలకించేందుకు ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు కిన్నెరసానికి వస్తుంటారు. కానీ డ్యామ్‌మీదగా వెళ్తే చాలు కోతుల బెడద పర్యాటకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గుంపులు గుంపులుగా కోతులు స్వైరవిహారం చేయడంతో పర్యాటకులు బెంబేలెత్తుతున్నారు. ఏదైనా తినాలనే ప్రయత్నం చేసేలోపు కోతులు వచ్చి లాక్కెళ్లడం, ఇవ్వకపోతే మీదపడి దాడి చేసి మరి గుంజుకెళ్తున్నాయని పర్యాటకులు వాపోతున్నారు. గతంలో పలువురు కోతుల భారీన పడ్డన ఘటనలు చాలా చోటు చేసుకున్నాయి. కోతుల గుంపులను చూసిన పర్యాటకులు వాటిని చూసి పరుగులు తీసే క్రమంలో ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. తీవ్ర భయాందోళనకు గురవుతున్నా వైల్డ్‌లైఫ్, జెన్‌కో అధికారులు పట్టించుకోవడంలేదని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడద కారణంగా పర్యాటకుల కిన్నెరసానికి రావాలంటే జంకుతున్నారు. దీంతో పర్యాటకుల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టింది.

నివారణకు ఈ చర్యలు..

కోతుల బెడదను నివారించడానికి లక్షలు ఖర్చుచేయాల్సిన అవసరం లేదు. ఎక్కువ కోతులు సంచరించే ప్రదేశంలో కొండముచ్చులను ప్రదేశంలో ఉంచితే చాలు వాటిని చూసి కోతులు దూరంగా సంచరిస్తాయి. వాటి దగ్గరకి రావాడానికి భయపడతాయి. కోతులకు ఆహారమైన పండ్ల తోటలను కిన్నెరసాని పరిసరాల్లో పెంచినట్లు అయితే కూడా కోతుల బెడదను నివారించవచ్చు. అదేవిధంగా సోలార్ విద్యుత్ కంచెను ఏర్పాటుచేసినా ఉపశమనం ఉంటుంది. ఇటీవల కిన్నెరసానిలో పర్యటించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్ డ్యామ్, డీర్‌పార్కు వద్ద కోతులను బెడదను చూశారు. కోతులు పర్యాటకుల వద్దకు రాకుండా చర్యలు తీసుకోవాలని కూడా వైల్డ్‌లైఫ్ అధికారులను ఆదేశించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు చర్యలు తీసుకుంటే పర్యాటకుల రద్దీ పెరిగి ప్రభుత్వానికి ఆదాయం గణనీయంగా లభిస్తుంది.

ప్రశాంతత లేకుండా చేస్తున్నాయి



కిన్నెరసానిలోని ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు కోతుల బెడద కారణంగా ప్రశాంతత లేకుండా చేస్తున్నాయి. పిల్లలతో కలిసి అక్కడ ఎదైన తినుబండారాలను తీసుకుందామంటే చాలు కోతులు పసిగట్టి వెంటాడిమరి గుంజుకెళ్తున్నాయి. దీంతో భయపడి పోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిన్నెరసానిలో కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలి. – పవన్, పర్యాటకుడు, ఖమ్మం

అధికారులు చర్యలు తీసుకోవాలి



పర్యాటకుల వద్ద డబ్బులు తీసుకుంటున్న టిక్కెట్ల కోసం డబ్బులు తీసుకునే అధికారులు పర్యాటకులకు ఇబ్బందులు కూడా చూడాల్సిన బాధ్యత వైల్డ్‌లైఫ్ శాఖ అధికారులపై ఉంది. కోతుల బెడద కారణంగా అక్కడ ఏమి తినకుండా బయటకు వచ్చిన తర్వాత తినాల్సివస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలి

– నాగిరెడ్డి, ప్రభాత్‌నగర్

సోలార్ కంచె ఏర్పాటుకు ప్రతిపాదనలు



కిన్నెరసానిలో పర్యాటకులను కోతల బెడద వేధిస్తున్న మాట నిజమే. అందుకోసం రూ.50 లక్షల అంచనాల వ్యయంతో డీర్‌పార్కు పరిసర ప్రాంతాల్లో కోతుల బెడదను నివారించేందుకు సోలార్ కంచెను ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. కోతుల నివారణకు తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

బి.బాబు, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ

హైకోర్టు తీర్పును వెంటనే అమలుచేయాలి


ఆందోళన చేస్తున్న నిర్వాసితులు, నాయకులు

టేకులపల్లి: హైకోర్టు తీర్పును వెంటనే అమలుచేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కోయగూడెం ఓసీ 2 భూ నిర్వాసితులు భారీ ర్యాలీ నిర్వహించి పీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి పీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైకోర్టు తీర్పు అమలు చేసి కోయగూడెం ఓసీ 2 ఫేజ్ 1, 2, 3లలో సాగు భూములు కోల్పోయిన గిరిజన నిర్వాసితుల భూమికి నష్టపరిహారం, సాగు భూమి, బాధిత కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా జరిపిన భూసేకరణ వల్ల వందలాది మంది గిరిజనులు నష్టపోయారన్నారు. రెవెన్యూ, సింగరేణి అధికారులు సమస్య పరిష్కారం చేయకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, చంద్రశేఖర్, దొడ్డ కోటేశ్వరరావు, సమ్మయ్య, చుక్కమ్మ, బోడ క్రిష్ణ, బానోత్ రామా, కోరం సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌పై దాడి అమానుషం


ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలోని ఇల్లెందులో గురువారం రాత్రి జర్నలిస్ట్ సుదర్శన్‌పై మారణాయుధాలతో దాడి చేయడం అమానుషమని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా పాత్రికేయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కొత్తగూడెంలో ఎస్పీ రోహిత్ రాజుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నిందితులను గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేయడం కృతజ్ఞతలు తెలిపిన నాయకులు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టు సంఘాల నాయకులు ఎం.డి.షఫీ, అచ్చి ప్రభాకర్ రెడ్డి, వట్టికొండ రవి, ఈమంది ఉదయ్‌కుమార్, ఈశ్వర్, సత్యానంద్, పోనిశెట్టి రమేష్, దాసరి వెంకటేశ్వర్లు, అబ్దుల్ పఠాన్, రామకృష్ణ, శ్రీనివాస్, క్రాంతికుమార్, సురేష్, ఠాకూర్ సింగ్, డేవిడ్, జాన్సన్‌బాబు పాల్గొన్నారు.

సభకు సన్నద్ధమైన కార్మికులు



విలీన సభను జయప్రదం చేయాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ..

ఇల్లెందు: ఐఎఫ్‌టీయూ సంఘం టీయూసీఐలో విలీన సభ కోసం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి తరలి వెళ్లేందుకు కార్మికులు సన్నద్ధమయ్యారు. ఆదివారం నిర్వహించనున్న సభకు ఇల్లెందులోని వివిధ విభాగాలకు చెందిన కార్మికులు సిద్ధం అయ్యారు. ఈ మేరకు శనివారం ఇల్లెందులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్, హమాలీ కార్మికులతో జరిగిన సభలో జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ మాట్లాడుతూ... ఐఎఫ్‌టీయూ, టీయూసీఐ రెండు సంఘాల విలీనం తర్వాత కార్మిక సంఘం ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు, సంపత్, సీతారాములు, రవి, శ్యామ్, వెంకటయ్య, గుల్ల వెంకన్న, ఐలయ్య, బోజ్యా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌లో ఆదివారం జరిగే టీయూసీఐలో ఇఫ్టూ విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ కొత్తగూడెం పట్టణంలో ఇఫ్టూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ కోశాధికారి పెద్దబోయిన సతీష్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అత్యంత క్రూరమైన చట్టాలను తీసుకొస్తూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరిస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్నా మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గం అంతా ఏకతాటిపై వచ్చి ఉద్యమించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు, మేధావులు అధికంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గోపాలరావు, బానోత్ ధర్మా, చంద్రశేఖర్, రాజశేఖర్, శంకర్, నాగమ్మ, నాగలక్ష్మి, సిద్ధు, శిరీష, మంగ, కృష్ణ, నరసింహా, పోశం, రామకృష్ణ, కరుణ, సంతోష్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి ఇంటికి ఎంపీలు



కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకుడు తూము చౌదరి నివాసానికి ఎంపీలు ఆర్.రఘురాంరెడ్డి, పోరిక బలరాంలు శనివారం వచ్చి ఆయన ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం మండల, పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, తెల్లం వెంకట్రావ్, జారె ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వితరణ


సింగరేణి(కొత్తగూడెం): వితరణ చేసిన పూర్వ విద్యార్థులతో అధికారులు


ఇల్లెందురూరల్: విద్యార్థులతో దాతలు

ఇల్లెందురూరల్: మండలంలోని జగదాంబగుంపు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు శనివారం స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. ఇల్లెందుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు దాసరి అజయ్, మేఘన దంపతులు, వారి మామయ్య పెద్దూరి వెంకటనర్సయ్య సహకారంతో స్కూల్ బ్యాగులు, బూట్లు, నోట్‌బుక్స్, స్కేల్, పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష ప్యాడ్‌లతోపాటు స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి హైస్కూల్ 1985 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలలో పేద విద్యార్థులకు ఫీజు, పుస్తకాలు, ఇతర ఆర్థికావసరాల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎడ్యుకేషన్ జీఎం గుండా శ్రీనివాస్, కార్యదర్శి సునీల్ కుమార్, ఉపకోశాధికారి యూనా కాంతారావు పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ.మురళీకృష్ణ, ఖారుఖ్ ఖాజదర్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ప్రారంభం

టేకులపల్లి: మండలంలోని చుక్కాలబోడు రైతువేదికలో తాగునీటి సహాయకులకు శనివారం శిక్షణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు, వాటర్‌గ్రిడ్ ఏఈ రమేష్, ఇంట్రా వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న అధికారులు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు


వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: పోలీసులు అంకిత భావంతో పని చేయాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని కొత్తగూడెం డీఎస్పీ ఎస్‌కె.అబ్దుల్ రెహమాన్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా జూలూరుపాడు పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు, పెండింగ్ కేసులకు సంబంధించిన ఫైల్స్‌ను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సత్ప్రవర్తనతో వ్యవహరించాలని పోలీస్ సిబ్బందికి ఆయన సూచించారు. ఏదైనా ఆరోగ్య సమస్య గానీ, ఇతర సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి భానుమతి

కొత్తగూడెంఅర్బన్: మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరముందని జిల్లా సివిల్ జడ్జి భానుమతి అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో వాక్ ఫర్ ఫ్రీడం అనే నినాదంతో పట్టణంలో ప్రదర్శన చేసి, అనంతరం పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా, బానిసత్వం, మానవ క్రయవిక్రయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేటి సమాజంలో మనుషులను వస్తువులాగా అమ్ముతూ బానిసలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టెలికాం రెగ్యులేటింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికార ప్రతినిధి ప్రభాకర్‌రావు, ప్రిన్సిపాల్ కత్తి రమేష్, షీ టీం ఎస్సై రమాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ బండి వెంకటేశ్వరరావు, సముద్రాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు చేసిన వారిని శిక్షించాలి


ధర్నా నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై ఇటీవల వరుసగా జరుగుతున్న దాడులకు నిరసనగా విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ ఓరుగంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించి దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి గంగాధరి సీత మాట్లాడుతూ... కావాలనే విదేశీ తీవ్రవాద శక్తుల ప్రోత్సాహంతో మతోన్మాద శక్తులు దేవాలయాలపై దాడులకు తెగబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిలుకూరి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దారా రమేష్, జిల్లా సంఘటన కార్యదర్శి చిట్టిశెట్టి లక్ష్మయ్య, జిల్లా సహ కార్యదర్శి భూక్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న బుగ్గవీటి సరళ

సింగరేణి(కొత్తగూడెం): మహిళా హక్కుల సాధనకు రాబోయే మూడేళ్లలో పోరాటాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని, ఈ నెల 21, 22, 23 తేదీల్లో కొత్తగూడెంలో జరుగే ఐద్వా 4వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ పిలుపునిచ్చారు. శనివారం టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... రాబోయే మూడేళ్లకు నూతన కమిటీ ఎన్నిక, మహిళా హక్కుల కోసం చేసిన పోరాటాలపై చర్చ ఉంటందున్నారు. పట్టణంలోని సూర్యప్యాలెస్ సమీపంలో భారీ బహిరంగసభ నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా 5వ, కార్యదర్శి ఎం జ్యోతి, పట్టణ అధ్యక్షురాలు అన్నవరపు ఇందిరా, సందకూరి లక్ష్మీ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ పెంపొందించాలి


పంపిణీ చేసిన సామగ్రితో విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ విలువలు పెరపొందించాలని కొత్తగూడెం ఎంఈఓ ప్రభుదయాల్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాఠశాల నిర్వహణ– విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఉపాధ్యాయ, సిబ్బంది అంతా అంకిత భావంతో విద్యార్థుల శ్రేయస్సు కోసం కృషి చేసేలా కౌన్సెలింగ్ నిర్వహించాలని, ఏ విధంగాను విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల నిర్వాహకులు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

స్వయం కృషితో ఉన్నత స్థాయిని సాధించాలని ఎంఈఓ ప్రభుదయాల్ అన్నారు. పాత కొత్తగూడెంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థులకు కలెక్టర్ ఆదేశాల మేరక ఒక ప్లేటు, గ్లాసు, మూడు దుప్పట్లు, ఒక దిండు, కార్పెట్‌ను పంపిణీ చేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు

చుంచుపల్లి: బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా దేశవ్యాప్తంగా జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం కొత్తగూడెంలోని పెద్ద బజార్, చిన్న బజార్‌లో ప్రాంతాల్లో బీజేపీ నాయకులు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పైడిపాటి రవీందర్, మండల అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, లక్ష్మణచారి, బీజేపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు గూడ విజయ, గోపికృష్ణ, శ్రీనివాస్, కూరపాటి రామారావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గమ్యం చేరే వరకు అపనమ్మకమే!


నిలిచిపోయిన బస్సును లాక్కెళ్తున్న మరో బస్సు..

ఇల్లెందు: ఇల్లెందు బస్ డిపోలో 20కి బస్సులు ఉండగా.. ఇందులో ఎక్కువగా పాతవే ఉన్నాయి. డిపో ప్రారంభించిన సమయాన ఇతర డిపోల నుంచి పాత బస్సులను కేటాయించగా అందులో ఏది ఎక్కడ నిలిచిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల ఓ బస్సు ఇల్లెందు సీతారామ టాకీస్ సమీపాన నిలిచిపోయింది. ఇక శనివారం ఓ బస్సు ఇలాగే ఆగిపోగా మరో బస్సు తెప్పించి రాడ్డు బిగించి లాక్కెళ్లారు. ఇల్లెందు డిపో ద్వారా మెరుగైన ఆదాయం వస్తున్నా కొత్త బస్సులు కేటాయించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. పాత బస్సుల కారణంగా గమ్యస్థానం చేరే వరకు ఏం జరుగుతోందనని పలువురు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.